## కథ




నామని సుజనాదేవి

ప్రొద్దుట్నుంచి విధి నిర్వహణలో విరామం లేకుండా పనిచేసిన సూర్యుడు అలసిపోయి పశ్చిమాద్రికి చేరాడు. మర్నాటివరకు వీడ్కోలడుగుతూ, పసుపు, ఎరుపు కలిసిన రంగుతో వింతశోభతో అలరారుతున్న ఆదిత్యుని వీడలేకపోతున్నట్లు తనివితీరా చూస్తూ పిల్లగాలికి తలలూపుతూ వీడ్కోలు చెబుతున్నట్లున్నాయి బాటకు ఇరువైపులా ఉన్న చెట్లు. ఇంటికి చేరుకుంటున్న ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు, కూలీలతో రకరకాల వాహనాలతో చాలా రద్దీగా ఉన్నాయి రహదార్లు. ఎవరి హడావుడిలో వారుండి, గూటికి చేరుకునే పక్షుల కువకువలను పట్టించుకునే పరిస్థితిలో లేక వాహనాల రణగొణ ధ్వనులతో ప్రొద్దుట్నుంచి చేసిన పనికి అలసిపోయి విసిగిపోయి, ఎవరి గమ్యాన్నివారు చేరుకునే తొందరలో ఉన్నారు.

పావుగంట నుండి బస్ కొరకు ఎదురుచూస్తున్న విశ్వనాథం, రోజురోజుకీ పెరుగుతున్న సిటీ వాతావరణాన్ని, యాంత్రికతను తిట్టుకుంటూ పూర్వపు రోజులను నెమరేసుకుంటున్నాడు. అపుడు ఒక ఊరిలో ఉండే అందరి పేర్లు, విశేషాలు ఆ ఊరిలో ఉండే అందరికీ తెలిసేవి. ఇపుడు ఈ అపార్ట్‌మెంట్‌ల నాగరికతలో కనీసం ఎదురింటి లేదా పక్కింటివారి గురించి కూడా ఏమీ తెలియడం లేదు. పైగా సమిష్టి కుటుంబాలూ పోయాయి. అప్పటి ఆప్యాయతానురాగాలు పోయాయి. ఏమిటో.. అనుకుంటూ అల్లంత దూరాన్నుండి నిండుగర్భిణిలా ఉన్న బస్సు వస్తూండటంతో ఎక్కడానికి సమాయత్తమయ్యాడు.

కిక్కిరిసిన బస్సు 'నీకిందులో చోటు లేదంటూ' వెక్కిరిస్తూ తనెక్కకుండానే కొంతమందిని ఎక్కించుకుని వెళ్ళిపోవటంతో ఉసూరుమంటూ, వెనుదిరగబోతూ ఆగి ఉలిక్కిపడ్డాడు. ఎందుకంటే అక్కడ నల్లగా ఉన్న మనీపర్సు కిందపడి ఉంది. చుట్టూ చూసాడు. చిన్న బస్టాప్, పైగా ఇంతకుముందు బస్సులో చాలా మంది ఎక్కటంతో ఐదుగురు మాత్రమే ఉన్నారు. వాళ్ళలో ఇద్దరు ఒక చోట, మరో ముగ్గురు మరో చోట ముచ్చట్లతో బిజీగా ఉండటంతో చటుక్కున వంగి పర్సు తీసుకున్నాడు. బరువుగా ఉంది. 'అన్నట్లు.. ఈ రోజు ఫస్ట్ తారీఖుకదూ! తను జీతం తెచ్చుకుంటున్నట్లే ఎవరివో జీతం దబ్బులున్నట్టున్నాయి' అనుకుంటూ మళ్ళీ అనుమానమొచ్చి కాదేమో.. అనుకున్నాడు. ఎన్నో సినిమాల్లో చూసినట్లు, కథల్లో చదివినట్లు, తీరా చూస్తే ఏమైనా చిత్తుకాగితాలున్నా అంతే బరువుంటుంది అనుకుంటూ టెన్షన్, కుతూహలం ఆపుకోలేక చుట్టూ చూసి, ఎవరూ చూడటం లేదని నిర్ధారించుకుని నెమ్మదిగా ఓ పక్కగా వెళ్ళి తెరిచి చూసాడు. కాని ఆ అనుమానం అబద్ధమైంది. ఐదు వందల నోట్లు చాలా ఉన్నాయి. బహుశా ఆరు ఏడు వేల చిల్లరుంటుందేమో! చిన్నగా విజిల్ వేసి అటుగా వచ్చిన ఆటో ఆపి ఎక్కేసాడు. ఎక్కుతుంటే బస్టాపులో ఉన్నవాళ్ళంతా తననే అనుమానంగా చూస్తున్నట్లనిపించి 'త్వరగా పోనీ' అన్నాడు ఆటో డ్రైవర్‌తో.

ఆటోలో కూర్చున్నా ఆలోచనలు అదేపనిగా సుడి తిరుగుతున్నాయి. 'టూ-ఇన్-వన్' తీసుకోవాలని, వి.సి.డి. తీసుకోవాలని ఎన్నాళ్ళుగానో కోరిగ్గా ఉంది. కాని 'గొర్రెతోక బెత్తెడు'లా ఎప్పుడూ బొటాబొటిగా సరిపోయే సంపాదన.. ఏదో ఒక ఖర్చుతో ఇప్పటివరకు కొనడం కుదరలేదు. ఈసారి ఏది ఏమైనా తప్పక కొనాలి.

ఇలా ఆలోచనల నడుమ తాను దిగే చోటు రావడంతో ఆపమన్నాడు ఆటోని. ఆలోచనలకు బ్రేక్ వేస్తూ ఆటో దిగుతుంటే, ఆటోలో ఉన్నవాళ్ళు తనవైపు అనుమానంగా చూసినట్లనిపించదతనికి. డబ్బులిస్తుంటే ఆటో డ్రైవర్ ఎగాదిగా చూస్తున్నట్లనిపించింది. 'ఇతనేమైనా నేను పర్స్ తీసుకుంటుంటే చూసాడా?' అనిపించిందతనికి. దానికి తగ్గట్లు డబ్బులు చేతిలో పెట్టి వస్తుంటే 'సార్!...' అని పిలుస్తున్నాడు. తను జేబులో నుండి డబ్బులు తీస్తుంటే, పొరపాటున గాభరాలో దొరికిన పర్స్ బయటకు వచ్చింది. అది చూసిగాని పిలుస్తున్నాడా? అని అనుకోగానే గుండె ఒక్క క్షణం ఆగి మళ్ళీ కొట్టుకుంటున్నటనిపించింది. వెనుదిరిగి చూడబుద్ధి కాలేదు. ఇంతలో అతను "మిగతా దబ్బులు తీసుకోరా సర్" అంటూ అరుస్తున్నాడు.

'హమ్మయ్య' అనుకుంటూ 'ఉంచుకో' అంటూ చూపుతిప్పి నడకవేగం పెంచాడు. దార్లో కూడా ఒకరిద్దరు తనవైపే చూస్తున్నట్లనిపించింది. దారిలో ఎవరో 'సార్' అని పిలుస్తున్నట్లనిపించినా, వినిపించుకోకుండా ఎవరో తరుముతున్నట్లు, ఇంట్లోకొచ్చి పడి చెమటలు తుడుచుకుంటూ, ఆయసంతో ఊపిరి పీల్చుకున్నాడు. కనీసం ముఖం కూడా కడుక్కోకుండా బెడ్‌రూంలోకెళ్ళి షర్ట్ విడిచి, ముందర దొరికిన మనీపర్స్ తీసి తెరిచాడు. డబ్బుల దొంతరతోపాటు ఉన్న ఐడెంటిటీ కార్డ్‌ను చూడగానే అతని ముఖం చిన్నబోయింది. ఛ! అందులో అడ్రస్ ఉంది. ఆ అడ్రస్‌కి పంపొచ్చు. కాని మనస్సు అంత తేలిగ్గా ఆ అదృష్టం వదులుకోవడానికి సిద్ధంగా లేదు. ఛ.. ఛ.. ఆ పారేసుకున్నవాడు ఐడెంటిటీ కార్డ్ అందులో ఉంచుకుని పారేసుకోవాలా! దీనితో మనస్సులో ఎప్పటికీ సంఘర్షణ అనుకున్నాడు. అతనికి అంతకుముందు స్వాముల వారు వచ్చినపుడు బోధించిన సూక్తి గుర్తొచ్చింది. 'దారిలో ఏదైనా దొరికితే అధముడైతే అటు, ఇటు చూసి ఎవరూ చూడట్లేదని తీసుకుంటారుట. మధ్యములయితే ఎవరిదో తెలిస్తే వారికిస్తారట. ఎవరో తెలియకపోతే తెలియదు కదా అనే తృప్తితో ఆత్మను సంతృప్తిపరిచి తీసుకుంటారట. ఉత్తములయితే ఆ డబ్బు తమకు సంబంధించినది కాదు గనక అది ఏ హుండీలోనో, ఏ పరోపకారార్థమో వినియోగిస్తారట. ఇక ఉత్తమోత్తముడయిన భక్తుడికి, అసలు దారిలో ఉన్న డబ్బు కనబడదట. అతనికి సర్వజగత్తంతా ఆ భగవంతుని స్వరూపమే గోచరమవుతుందట. ఇపుడు తనిందులో ఏ కేటగిరీకి చెందినవాడు కావాలనుకుంటున్నాడో విశ్లేషించడానికి మనస్సంగీకరించలేదు. అందుకే ఆ విషయాలు గుర్తులేవన్నట్లు, అడ్రసున్నదెవరు చూడొచ్చారు? ఐడెంటిటీ కార్డ్ చింపేస్తే సరి అనుకుని మళ్ళీ అన్నీ అందులో పెట్టి పాకెట్‌లో పెట్టేసుకుని, స్నానం చేసి, డ్రెస్ మార్చుకుని బయటకొచ్చాడు.

పేపర్ ముందేసుకుని ఇలా కూర్చున్నాడో లేదో "ఏమండీ! ఎవరో పోలీసతను మీకోసం వచ్చారు. మిమ్మల్ని రమ్మంటున్నారు" అన్న సతీమణి కేకకు హార్ట్ బీట్ ఒక్కసారిగా పెరిగిపోయింది. చెమటతో తడిసిపోయాడు. అప్పుడే తను పర్స్ పట్టుకొచ్చిన సంగతి తెలిసిపోయిందా అనుకుంటూ హడావుడిగా రాబోతూ, లోనికెళ్ళి ఆ పర్స్ తీసి బీరువాలో పెట్టి వచ్చాడు.

నిర్జీవమైన ముఖంతో రాగానే "నమస్కారం సార్!" అన్నాడా కానిస్టేబుల్. ప్రశ్నార్థకంగా చూస్తున్న అతనితో "మరేంలేదు సర్.. మొన్న ఎదురింట్లో దొంగలు పడి దోచుకుంటూ కొట్టారట. ఈ విషయమై చుట్టూ ఉన్న ఇళ్ళల్లోని వారిని ఎంక్వైరీకి ఒకసారి రమ్మన్నారు సర్! రేపొకసారి స్టేషన్‌కి వచ్చి వెళ్ళండి సర్" అన్నాడు.

'అమ్మయ్య' అనుకుని, మౌనంగా తలూపగానే వెళ్ళిపోయాడతను. ఆ టెన్షన్‌కి, యాభై లంఖణాలు చేసినవాడిలా ఉస్సూరుమంటూ కూలబడ్డాడు.




మరో పది నిమిషాలకు ఏడుస్తూ వచ్చిన కూతురు భార్గవిని, "ఏంటమ్మా.. ఏమయ్యింది" అంటూ ఆదుర్దాగా పలకరించాడు.

"నేను.. బస్‌లో వస్తుంటే..."

"వస్తుంటే.. ఎవరైనా ఏమైనా కామెంట్ చేసారా.. ఏమైందో చెప్పమ్మా"

"లేదు నాన్నా.. నేను బస్‌లో వస్తుంటే, నా హేండ్ బాగ్‌లోని చిన్న మనీపర్స్ పడిపోయినట్టుంది నాన్న. బస్ ఎక్కేపుడు ఉంది. దిగాక చూసుకుంటే లేదు. ఒకవేళ టికెట్ తీసుకుంటుంటే, పడిపోయిందేమో నాన్న. ఈ రోజు ఇచ్చిన నా మొట్టమొదటి జీతం డబ్బులు, నేను ఎక్స్‌ట్రా గంటలు పనిచేసిన మొత్తం డబ్బులు అందులోనే పెట్టాను నాన్న" అంటూ బావురుమంది భార్గవి.

స్థాణువయ్యాడు విశ్వనాథం. 'నిజంగా దేవుడెంత జగన్నాటక సూత్రధారి. తనకు పర్స్ దొరికిందని సంతోషపడుతుంటే, తన కూతురిది పోగొట్టాడు' అనుకుని "పోతేపోయిందిలేమ్మా! ఇంత చిన్న విషయానికి ఏడుస్తారా? బాధపడకు" అంటూ కాసేపు ఓదార్చి, సతీమణికి కూతురిని ఊరడించమని అప్పగించి వారు లోనికెళ్ళగానే దొరికిన మనీపర్స్ తీసాడు.

కూతురి జీతం పోయింది కాబట్టి, అందుకనే దేవుడు ఈ డబ్బులు దొరికేలా చేసాడనుకుని ఐడెంటిటీ కార్డ్ ఉన్నంతవరకు చికాకే అనుకుంటూ కార్డ్ చింపేసాడు. మనస్సు కొంచెం ప్రశాంతంగా అయినట్లనిపించింది.

కానీ తెల్లవారి లేచిన దగ్గర్నుంచీ పూజ చేస్తుంటే, ఆఫీసులో పని చేస్తుంటే, ఎప్పటికీ మనసులో ఏదో అలజడి. అన్యమనస్కంగానే పని పూర్తి చేసుకుని, కాస్తంత ముందరే బయల్దేరి, దార్లో గుళ్ళోకెళ్ళి వచ్చాడు ప్రశాంతత కోసం.

ఇంటికి చేరగానే కాఫీ కప్పందిస్తూ ఇంకా ముభావంగా, బాధగా ఉన్న భార్గవి "నాన్న! నా పర్స్‌లో నా పేరు ఆఫీస్ అడ్రస్ ఉంది. కాబట్టి ఒకవేళ ఎవరికైనా దొరికితే తెచ్చిస్తారేమో నాన్న!" అంది ఆశగా.

"పిచ్చి తల్లీ! ఇంకా అంత నిజాయితీపరులు లోకంలో ఉన్నారనుకుంటున్నావామ్మా" అన్నాడు ఆమె తల నిమురుతూ, ఆమె ఆశను పెంచి, తర్వాత ఇంకా నిరాశ ఎక్కువ కావడం ఇష్టంలేక.

"ఎందుకు ఉండరు నాన్నా! ఒకవేళ మీకే ఇలా పర్స్ దొరికిందనుకోండి. అందులో అడ్రస్ ఉంటే వెళ్ళి ఇవ్వరూ.. లోకం అంటే మనమే నాన్న! అందరూ నేనొక్కడినీ నిజాయితీగా ఉంటే ఏం లాభం లోకమంతా లేదుగా అని అవినీతిగా మసిలితే ఇక న్యాయానికి చోటెక్కడిది. అందుకే మనలాంటి వాళ్ళెవరైనా ఇలా ఆలోచించి తెచ్చిస్తారేమో" అంది భార్గవి.

ఉలిక్కిపడ్డాడు విశ్వనాథం. పొరపాటున తనకు పర్స్ దొరికిన సంగతి కూతురుకు తెలిసిపోయిందా ఏమిటి? అసలు ఆ ఆస్కారమే లేదు. మాటవరసకి కేవలం యాదృచ్ఛికంగా భార్గవి ఆ మాటలు అన్నా.. అందులో ఎంత సత్యం ఉంది. ఆమె మాటలు సూటిగా హృదయాన్ని తాకటంతో ఉలిక్కిపడ్డ విశ్వనాథంలో అంతర్మథనం మొదలయ్యింది. మనస్సంతా అల్లకల్లోలంగా తయారయ్యింది. తనింట్లో జీతం మాత్రమే కాక, తాను పెట్టిన బిజినెస్ నుండి వచ్చే ఆదాయం కూడా వస్తున్నా నెలాఖరుకు చాలా కష్టంగా ఉంటుంది. అటువంటిది పాపం... ఎవరో మొత్తం నెల జీతమంతా పోగొట్టుకున్నారు. నెలంతా ఎన్ని కష్టాలు పడతారో ఈ పాపమంతా తనకు తగలదూ. 'టూ-ఇన్-వన్' తీసుకున్నా 'వీసిఆర్' కొనుక్కున్నా అది చూసినప్పుడల్లా తన మనస్సుకి అది తన కష్టార్జితం కాదన్నది ముల్లులా గుచ్చుకోదూ. ప్రశాంతంగా ఉండగలడా...' ఇలా రకరకాల ఆలోచనలతో చివరికి దృఢనిశ్చయానికి వచ్చినట్లు హడావుడిగా లేచి లోనికెళ్ళి చింపిన ఐడెండిటీ కార్డ్ కోసం వెదికి అవి సరిగ్గా పేర్చి చూసి అడ్రస్ నోట్ చేసుకుని, ఆ పర్స్ తీసుకుని డ్రస్సప్ అయి 'ఇప్పుడే వస్తా' అంటూ ఒక కేకేసి రోడ్డెక్కాడు.

ప్రక్క కాలనీ అడ్రస్ అది.

ఒక అరగంట తర్వాత దొరికింది ఇల్లు. గుడ్డి వెలుతురు నిశ్శబ్దంగా రాజ్యమేలుతున్నట్లుంది ఇంట్లో. దాన్ని భగ్నం చేస్తూ దగ్గు అప్పుడప్పుడు వినబడుతోంది. ముందు గదిలో ఎవరూ లేరు. తలుపుపై టక టక శబ్దం చేసాడు విశ్వనాథం. లోపల్నుండి ఒక మధ్యవయసావిడ వచ్చింది. బహుశా ముప్పై, ముప్పై ఐదు మధ్యలో ఉంటుందేమో వయస్సు. బక్క పలుచగా ఉంది. కళగా

ఉన్న ముఖం, నుదుట ఎర్రటి సిందూరం. కాని కళ్ళు ఎందుకో ఏడ్చినట్లు ఉబ్బి ఉన్నాయి.

"ఇది పరమేశ్వర్‌గారిల్లేనాండి" అన్నాడు ఐడెంటిటీ కార్డ్ అడ్రస్ గుర్తుచేసుకుంటూ విశ్వనాథం.

"ఆc.. అవును కాని ఆయన ఇంట్లో లేరండీ' అంది.

"ఎవరమ్మా లక్ష్మీ! ఏమయినా తెలిసిందా తల్లీ" ఆయాసంగా వినిపించింది లోపల్నుండి దగ్గుతున్న గొంతు.

"లేదు మామయ్యా! ఎవరో ఆయనకొరకొచ్చారు" అంటూ, "త్వరగానే వస్తారు. కూర్చుంటారా!" అంది ఆవిడ లోనికి జరిగి పక్కనున్న కుర్చీ చూపిస్తూ.

నిశ్శబ్దంగా వెళ్ళి కూర్చున్నాడు. ఆమె లోపలికెళ్ళింది. ఇంటి పరిస్థితి చూస్తే పేద కుటుంబంలానే ఉంది.

"మందులైపోయినట్లున్నాయి. అయినా ఇక.. ఈ నెల తేవడం ఉండదేమో. ఇప్పటికే బోలెడు అప్పు ఉంది ఇంకేం తెస్తాడు" గొణుక్కున్నట్లు వినిపిస్తోంది లోపల్నుండి దగ్గుతున్న గొంతు.

"నెమ్మదిగా మామయ్య. బయట ఆయన కూర్చున్నారు. అయినా ఈ నెల ఎందుకుండదు ఎవర్నైనా అడిగి తెస్తానని వెళ్ళారుగా! ఈపాటికి వస్తూ ఉంటారులే" అంటోంది ఆమె చిన్న గొంతుతో.

లోపల్నుండి పిల్లాడనుకుంటాను... "మరేమో... అమ్మ రేపు స్కూల్ ఫీ తప్పక కట్టాలంట. ఇప్పటికే పోయిన నెలది కూడా కట్టలేదు. రెండు కలిపి ఈ ఫస్ట్‌కి ఇస్తానని నాన్న చెబితే, ఆ విషయమే చెప్పాం స్కూల్లో. ఫస్ట్ అయిపోయింది కాబట్టి రేపు కట్టకపోతే పరీక్షలకి చెల్లిని, నన్ను కూర్చోనివ్వరంట" అంటున్నాడు. అన్నింటికీ మౌనమే సమాధానంగా ఉన్నట్లుంది.

ఇల్లు చాలా చిన్నదనుకుంటా. అందుకే ముందున్న చిన్న గదిలో, తను కూర్చున్నా లోపలి మాటలు స్పష్టంగా వినబడుతున్నాయి అనుకున్నాడు. ఛ.. అసలు తనెంత మూర్ఖంగా ఆలోచించి డబ్బు తీసుకోవాలనుకున్నాడు. పరుల డబ్బు పాముతో సమానమంటారు. ఇలా తను డబ్బు తీసుకురావడం ఎంత మంచిదయింది. ఈ ఇంటి పరిస్థితి చూస్తే డబ్బు వారికెంత అవసరమున్నదో స్పష్టంగా తెలుస్తుంది అనుకుంటుండగా గుమ్మంలో నుంచి ఐడెంటిటీ కార్డ్‌లో ఉన్న వ్యక్తి పోలికలతో, ఇంకాస్త బక్కపలుచగా ఉన వ్యక్తి లోనికొచ్చాడు. అతని ముఖంలో నిరాశానిస్పృహలు ప్రస్ఫుటంగా కనబడుతున్నాయి.

అతడు వచ్చినట్లయిన శబ్దానికనుకుంటాను లోపల్నుండి ఆవిడ ఆతృతను అణచుకోలేనట్లుగా "ఏమయ్యిందండీ!" అంది.

"లాభం లేదు లక్ష్మీ! దొరకలేదు" అంటూ "మీరు..." అన్నాడు విశ్వనాథాన్ని చూసి ప్రశ్నార్థకంగా.

"నేను మీకు తెలీదులెండి. ఐయామ్ విశ్వనాథం. వర్కింగ్ ఇన్ ఏ.పి.యస్.ఇ.బి. నేనెందుకొచ్చానంటే బస్ స్టాప్‌లో మీ పర్స్ దొరికింది. అది తీసుకునొచ్చాను" అంటూ పర్స్ తీసిచ్చాడు విశ్వనాథం.

"ఆc.. నిజంగా దొరికిందా! ఆc.. ఈ పర్స్ నాదే. లక్ష్మి దేవుడున్నాడు లక్ష్మీ" అంటూ ఆనందాతిరేకంతో కళ్ళనుండి నీళ్లు కారుతుండగా "నిజంగా మీరు దేవుళ్ళు సర్" అన్నాడు సంతోషంతో.

ఇంక ఆవిడైతే "ఇవాళ రేపు ఈ కాలంలో దొరికినా ఇలా ఇంటికొచ్చి ఎవరిస్తారండీ అన్నయ్యగారు. మీకు మేము చాలా ఋణపడి ఉంటాం" అంటూ "ఇప్పుడే వస్తా"నంటూ లోనికెళ్ళి "మామయ్య.. పర్స్ దొరికింది. ఇందాక వచ్చినాయన తెచ్చారు" అంటూ చెబుతోంది.

అప్పటివరకు అసలు 'పర్స్ అతనిదేనా' అని ముందర, 'అందులో ఏమేం ఉన్నాయ్' అంటూ చిన్న చిన్న పరీక్షలు పెట్టి నిర్ధారణ చేసుకున్నాక ఇద్దామనుకున్న విశ్వనాథం, అక్కడి పరిస్థితి చూసి ఎటువంటి పరీక్ష అవసరంలేదనుకున్నాడు.

లోపల్నుండి వచ్చిన పిల్లలు "నాన్నా! అయితే రేపు మా స్కూల్ ఫీ కడతారా! మేము పరీక్ష రాయొచ్చుగా" అంటూ సంతోషంగా అడుగుతున్నారు.

అతను "ఆc..." అంటూ పిల్లల తలలు నిమిరి విశ్వనాథం వైపు, అతని ముందర ఆయన పరిస్థితి బయటపడ్డందుకేమో ఇబ్బందిగా చూసి "లక్ష్మి... తినడానికేమైనా తీసుకురా. అలాగే భోజనాలకి ఏర్పాట్లు చెయి" అంటూ "ఈరోజు తప్పక ఇక్కడ మీరు భోంచేయాలండీ" అన్నాడు విశ్వనాథంతో.

"లేదండీ. అర్జంట్ పనుంది. వెళతాను.." అన్నాడు విశ్వనాథం లేచి నిల్చుంటూ. కానీ టిఫిన్, టీలయ్యాకగాని 'దేవుడంటూ' వందోసారి పొగడుతూ సాగనంపారా దంపతులు. వారలా పొగడుతుంటే భూమిలోకి కుచించుకుపోతున్న ఫీలింగ్, ప్రతీసారి విశ్వనాథంలో. కానీ వాళ్ళ ముఖంలోని సంతోషం ఎందుకో చెప్పలేనంత తృప్తినిచ్చిందతనికి. ఇందులో తన డబ్బులు తీసికెళ్ళి వారికివ్వలేదు. కేవలం వాళ్ళవి వారికిచ్చినా ఎందుకింత ఆనందం, ప్రశాంతతో అర్థం కాలేదతనికి. మనస్సంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంది.

ఇంట్లోకి రాగానే భార్గవి "నాన్నా! ఇవ్వాళెంత చిత్రం జరిగిందో చూసారా. నా పర్స్ పోయింది ఇక రాదనుకున్నాం కదూ! పాపం ఎవరో ఒకతను ఆఫీసుకువెళ్ళి అక్కడి నుండి ఇంటి అడ్రస్ తీసుకుని, ఇక్కడకు తెచ్చిచ్చారు నాన్నా! కాంప్లిమెంట్‌గా డబ్బులు ఇస్తానన్నా తీసుకోలేదు. నిజంగా దేవుడు కదూ! అతని అడ్రస్ తీసుకున్నాను. తర్వాతేదయినా గిఫ్ట్ తీసుకెళ్ళి ఇచ్చివద్దాం. ఈ కాలంలో కూడా ఇలాంటి వాళ్ళు ఉంటారా అన్నావు కదూ! ఉన్నారు కదూ..." అంటూ సంతోషంగా చెప్పుకుపోతోంది. కానీ అతనికదేం వినిపించడం లేదు.

నిజంగా దేవుడెంతటి జగన్నాటక సూత్రధారి కాకపోతే ఇలా పావుల్ని కదుపుతాడు. తను న్యాయంగా ఎవరిది వారికిచ్చేస్తే తనది తనకు చేరేలా చేసాడు. ఇదే విషయం మరెవ్వరు చెప్పినా తను నమ్మకపోయేవాడు. ఏదో కథల్లో చదివినట్లు, సినిమాల్లో చూసినట్లు జరిగింది. అనుకుంటూ కనిపించని ఆ దేవునికి శతకోటి వందనాలు మనస్సులోనే చేసాడు.

○

## టిక్కెట్లు దొరకని శ్రియ

'శివాజి' సినిమాలో నటించడం వల్ల శ్రియ కెరీర్‌కి కూడా మేలు జరిగింది. ఇప్పుడు తమిళ రంగంలో శ్రియకి బోల్డు డిమాండ్ ఏర్పడిందిట. ఆ మాటలా వుంచితే 'శివాజి' సినిమాని జనాలతోపాటు కలిసి సాధారణ ప్రేక్షకురాలిగా చూడాలని చెన్నయ్‌లోని ఓ థియేటర్‌కి శ్రియ వెళ్లిందిట. కానీ టిక్కెట్లు దొరకలేదట. శ్రియని గుర్తించిన థియేటర్ సిబ్బంది కూడా 'సారీ మేడమ్ టిక్కెట్లు లేవు' అన్నారే తప్ప టిక్కెట్లు ఇవ్వలేకపోయారట. దాంతో ఆమె ఆ సినిమాని ముంబాయి వెళ్లినప్పుడు అక్కడే చూడాలని నిర్ణయించుకుందిట. శ్రియ తొలి హిందీ సినిమా 'ఆవారాపన్' జూన్ 29న రిలీజ్ అయింది. ముస్లిం అమ్మాయిగా నటించిన శ్రియకి ఈ సినిమా బాలీవుడ్‌లో మంచి గుర్తింపే తెస్తున్నట్టు ప్రాథమిక సమాచారం.

